క్లుప్తంగా

ఉద్యోగాలు ఇచ్చినందుకా..

సత్తుపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే 55వేలు పైచిలుకు ఉద్యోగాలు ఇచ్చినందుకు ప్రతిపక్షాలు నిరాశలో ఉన్నాయా అని అసెంబ్లీలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల లోపు రుణమాఫీ, ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు వస్తున్నందుకు నిరాశలో ఉన్నారా అని ప్రతిపక్షాలను ప్రశ్నించారు.

108 వాహనం ప్రారంభం

కొణిజర్ల: కొణిజర్ల మండలానికి కేటాయించిన 108, 102 వాహనాలను సోమవారం సొసైటీ వైస్ చైర్మన్ నెల్లూరి రమేష్, మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు, మండల వైద్యాధికారి డాక్టర్ శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఈ వాహనాలు అందుబాటులో ఉండటం వల్ల ఆపత్కాల సమయంలో ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్, ఈఎంఈ దుర్గా ప్రసాద్, పీహెచ్‌సీ, 108 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వధర్మక్షేత్రానికి రూ.లక్ష వితరణ

సత్తుపల్లిరూరల్: మండలంలోని బుగ్గపాడులోని శ్రీవిశ్వధర్మక్షేత్ర శివాలయ అభివృద్ధికి సత్తుపల్లికి చెందిన తుమ్మూరి శ్రీనివాసరావు, స్మిత దంపతుల కుమారుడు, కుమార్తె రాహుల్, వీణసాహితి సోమవారం రూ.1,00,116లను ఆలయ నిర్వాహకుడు వెల్లటూరి ప్రసాదాచార్యులకు అందించారు. అదే విధంగా నాగులవంచ మారేశ్వరరావు, శైలజ దంపతులు 600 గ్రాముల వెండి ప్లేట్‌ను స్వామివారి పూజకు వితరణగా అందించారు.

క్రీడా సామగ్రి పంపిణీ

కారేపల్లి: కారేపల్లిలోని గణేష్ సెంటర్‌లో యువకులకు బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకుడు, జామే మసీదు మాజీ అధ్యక్షుడు షేక్ గౌసుద్దీన్ రూ.6వేలు విలువ చేసే షటిల్ కిట్లు, బ్యాట్లు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు ఆటలపై దృష్టి పెట్టితే, ఆరోగ్యంతో పాటు, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు ఎండీ ఖలీలుల్లాఖాన్, రమేష్, మత్స్యకారుల సంఘం అధ్యక్షులు సాంబ, రవి, సద్దాంహుస్సేన్, అబ్దుల్ వహీద్, ఫిరోజ్, సందీప్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ చేయాలి

పెనుబల్లి: చౌక దుకాణాల ద్వారా పేద ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఐద్వా మండల కార్యదర్శి మిట్టపల్లి నాగమణి అన్నారు. సోమవారం మండలంలోని లంకపల్లిలో చౌకదుకాణాలను భలోపేతం చేయాలంటూ ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సరసమ్మ, సుక్కుబాయి, నాగమణి, వెంకమ్మ, రమణ, సౌజన్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గంగారం పీహెచ్‌సీ వైద్యురాలిగా స్పందన


స్పందన

సత్తుపల్లిరూరల్: గంగారం పీహెచ్‌సీ వైద్యురాలిగా డాక్టర్ టి.స్పందన సోమవారం విధుల్లో చేరారు. గతంలో సింగరేణి ఏరియా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ వైద్యురాలిగా పని చేశారు. ఇటీవల జరిగిన వైద్యుల నియామకాల్లో గంగారం పీహెచ్‌సీ వైద్యురాలిగా నియమితులయ్యారు.

పూర్వ విద్యార్థికి సన్మానం..

కల్లూరు: తూర్పు నౌకాదళంలో సబ్ లెఫ్టినెంట్ జనరల్‌గా ఎంపికైన తమ పాఠశాల పూర్వ విద్యార్థి పెద్దపోలు ఆకాష్‌ను సోమవారం బాలాజీ హైస్కూల్ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ వలసాల బాలాజీ, హెచ్‌ఎం కొద మసింహం నరేంద్ర కుమార్, సీహెచ్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11న చండీయాగం


నారాయణపురంలో గోపూజ నిర్వహిస్తున్న మహిళలు

తల్లాడ: మండల పరిధిలోని నారాయణపురంలో ఈ నెల 11న మహా చండీ యాగం జరగనుంది. ఇందు కోసం సోమవారం అర్చకులు కంచెల సతీష్ శర్మ ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొణిజర్ల: కొణిజర్ల, చింతకాని మండలాల పరిధిలోని 33 కేవీ విద్యుత్ లైన్ల మర్మమతులు దృష్ట్యా మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పెద్దగోపతి ఏడీఈ తిలక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధాన్యం రైతులు దగా


కల్లంలో ఆరబోసిన వడ్లను నేర్పుతున్న రైతు


తల్లాడ కల్లంలో ఆరబెట్టి ఉంచిన 1262 రకం వరి ధాన్యం

సాంబ సన్నాలు 1262 వడ్లను కొనేదెవరు ..?

- వందలాది ఎకరాల్లో రైతుల సాగు
- కేంద్రాల్లో తేమశాతం పేరుతో తిరస్కరణ
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

తల్లాడ: ఆరుగాలం కష్టించి పండించిన పంట అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి అన్న చందంగా మారింది రైతుల పరిస్థితి. పండించిన ప్రతి గింజను కొంటామని ప్రభుత్వం, అధికారులు పదే పదే చెబుతున్నా ఆచరణలో మాత్రం విఫలమౌతున్నారు. ఇందుకు ఉదాహరణ తల్లాడ మండలంలో సాగు చేసిన సాంబ 1262 సన్నాల వరి ధాన్యం రైతులే.

మండలంలో 7వేల ఎకరాల్లో సాగు..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో రైతులు మండలంలో 7 వేల ఎకరాల్లో 1262 సాంబ సన్నరకం సాగు చేశారు. ఈ రకం వరి ఎకరానికి 40 బస్తాల దిగుబడి రాగా.. బీపీటీ సాంబ 30 బస్తాల దిగుబడి వచ్చింది. పెట్టుబడి తక్కువతో పాటు దిగుబడి కూడా అధికంగా వస్తుందనే ఉద్దేశంతో సాగు చేసిన రైతులకు ఈ ఏడాది చేదు అనుభవం ఎదురౌతుంది. ప్రభుత్వం ద్వారా వరి విత్తనాలను అందించి పంట పండిన తర్వాత కొనేటప్పుడు తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీంతో సాగు చేసిన రైతులు కల్లాల్లో వడ్లను ఆరబెట్టి కాంటాల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. రాత్రిం బవళ్లు కల్లాల్లో కాపలా కాయాల్సి వస్తోంది.

ధాన్యం కొనట్లేదు..



ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చిన 1262 రకం వరి విత్తనాలనే 18 ఎకరాల్లో సాగు చేశాను. అంతా కైలు చేసి వడ్లను కల్లంలో ఆరబెట్టి ఉంచాను. తేమ శాతం కూడా 17 వరకు వచ్చింది. కాంటా వేయమని సొసైటీ కొనుగోలు కేంద్రం వద్దకు, మిల్లుల వద్దకు తిరుగుతున్నా పట్టించుకోవట్లేదు.
– దామవరపు బుజ్జి, రైతు, తల్లాడ

15 రోజులు కల్లంలోనే..



ఐదెకరాల్లో సాగు చేసిన 1262 వడ్లను కైలు చేసి కల్లంలో ఆరబెట్టి 15 రోజులవుతుంది. తేమ శాతం వచ్చినా కొనుగోలు చేయటంలేదు. వడ్లు కొనాలని కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లి అడిగితే రేపు, ఎల్లుండి అని కాలయాపన చేస్తున్నారు. అదే బీపీటీ సాంబ మసూర వడ్లను వెంటనే కొంటున్నారు.
– ఇస్నేపల్లి సుందర్‌రావు, రైతు, గొల్లగూడెం

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ అనూష

ఎర్రుపాలెం: మండలంలోని కండ్రిక గ్రామంలో సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అధికారులు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ జి.అనూష పంటల సాగులో విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యుత్ మోటార్లకు రైతాంగం విధిగా కెపాసిటర్లు అమర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ చిన్న పుల్లయ్య, లైన్‌మెన్ నారాయణరెడ్డి, జూనియర్ లైన్‌మెన్ వంశీ, జూనియర్ లైన్‌మెన్ ఆనంద్‌రావు, తదితరులున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పోరాటం


మాట్లాడుతున్న వెంకట్

సత్తుపల్లిటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలపై పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ అన్నారు. సోమవారం స్థానిక రావి వీరవెంకయ్య భవనంలో నిర్వహించిన విలేకరు సమావేశంలో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావుతో కలిసి మాట్లాడారు. మతోన్మాద బీజేపీ గొడ్డలిపెట్టుగా మారిందన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ఏడాది పాలన సంతృప్తికరంగా లేదని ఆయన విధానాలు ఆచరణ మారాలని సూచించారు. ఈ నెల 18,19వ తేదీల్లో సత్తుపల్లిలో జరిగే జిల్లా మహాసభలకు కేంద్ర, రాష్ట్ర నాయకులు బి.వి.రాఘవులు, తమ్మినేని వీరభద్రం, వీరయ్య తదితర నేతలు హాజరౌతారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు మాచర్ల భారతి, మాదినేని రమేష్, జాజిరి శ్రీనివాస్, మోరంపూడి పాండు, చలమాల విఠల్, డివిజన్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, రాజబాబు, సర్వేశ్వరరావు, జ్యోతి, కరుణ, రామలింగేశ్వరరావు, తిరుపతిరావు, కృషార్జున్‌రావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

మధిర: ప్రజా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం నూతన డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు డిమాండ్ చేశారు. సోమవారం మధిర డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్ష పార్టీగా నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని తెలిపారు. సిరిపురం సమీపంలోని ఎండపల్లి గుట్ట నుంచి అక్రమ మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని, మధిర పట్టణంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలన్నారు. మధిర, బోనకల్ మండల కేంద్రాల్లో రైల్వే అండర్ పాస్ నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. ఈ నెల 12న జిల్లా కేంద్రంలో ఉద్యమ కార్యాచరణ ఉంటుందన్నారు. నాయకులు నరసింహారావు, సైదులు, మురళి, రామనరసయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు పోస్ట్ కార్డులు

ముదిగొండ: అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తింప చేయాలని డిమాండ్‌చేస్తూ మండలంలోని చిరుమర్రి గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డులు రాసి పంపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కోలేటి ఉపేందర్ రావు మాట్లాడుతూ.. యాసంగి పంటలకు రైతుభరోసా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామారావు, నాగేశ్వరరావు, బండి శేఖర్, మాధవరావు, కోటేశ్వరరావు, జగన్ మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రలో మడుపల్లి విద్యార్థులు

మధిర: మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి విహారయాత్రకు వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అత్యంత ప్రాధాన్యత కలిగిన వైజాగ్, బొర్రా గుహలను సందర్శించారు. వైజాగ్‌లోని కైలాసగిరి జూ పార్క్, బంగాళాఖాతం సముద్రం బీచ్, సబ్ మెరైన్ మ్యూజియం, విమాన మ్యూజియం, సింహాచలంలోని నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించారు. ట్రైబల్ మ్యూజియం సందర్శించి గిరిజన నృత్యాలను, వారి ఉత్పత్తులను తిలకించారు.

ఇంటి స్థలం ఇప్పించాలని ఫిర్యాదు


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కారేపల్లి: మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందిన మోకాళ్ల సమ్మక్క, సుజాత లకు చెందిన ఇంటి స్థలం, వ్యవసాయ భూమిని కొంత మంది ఆక్రమించారని, అన్ని ఆధారాలు ఉన్నా.. స్థానిక అధికారులు ఎవరూ పట్టించుకోవట్లేదని సోమవారం ఖమ్మం కలెక్టరేట్ ప్రజావాణిలో పిర్యాదు చేశారు. 50 సంవత్సరాలుగా తమకు వారసత్వంగా వచ్చిన భూమిని అక్రమ మార్గంలో అక్రమించారని, ఇండ్లస్థలాన్ని సైతం ఆక్రమించారని.. తమ స్థలంలోకి వెళ్లితే మాపై దౌర్జన్యం చేసి అడ్డుకున్నారని.. ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి తమ భూమిని తమకు ఇప్పించాలని వేడుకున్నారు. వీరివెంట గ్రామ పెద్దలు తేజ్యానాయక్, మునిరాం, నాగయ్య తదితరులు ఉన్నారు.

నేడు సీఎం కప్ క్రీడాపోటీలు

ఏన్కూరు: నేడు స్థానిక గురుకుల విద్యాలయంలో సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సకానాల రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయని, క్రీడాకారులు సకాలంలో హాజరు కావాల్సిందిగా కోరారు.

మాజీ సర్పంచ్‌లు, ఆశా వర్కర్ల అరెస్ట్


ఎర్రుపాలెం: పోలీసుల అదుపులో ఆశా కార్యకర్తలు

తల్లాడ: తల్లాడలో సోమవారం మాజీ సర్పంచులు, ఆశా వర్కర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. తమ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లిచాలని మాజీ సర్పంచులు జేఏసీ నిర్ణయం మేరకు హైదరాబాద్ బయలుదేరగా మాజీ సర్పంచ్‌ల గృహాలకు వెళ్లి అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమనీ సీపీఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు ఖండించారు. అలాగే ఆశా వర్కర్ల మండల అధ్యక్షురాలు రాణిని అరెస్ట్ చేయడం సరికాదన్నారు.

ఆశా కార్యకర్తలు..

ఎర్రుపాలెం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 15 మంది ఆశా కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండల కమిటీ అధ్యక్షులు గరికపాటి ఏసుమణి, నంద్రు సుధారాణి, వెంకటనర్సమ్మ, హైమావతి, ధనలక్ష్మి, సుజాత, ముత్యాలు, విజయ, కోటమ్మ, వెంకట్రావమ్మ, మాణిక్యమ్మ, కొండమ్మ, సునీత, కమలమ్మ, తదితరులను అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి సగ్గుర్తి సంజీవ రావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి ప్రభాకర్‌లు మాట్లాడుతూ.. న్యాయమైన సమస్యల పరిష్కారానికై వెళ్తున్న వారిని అరెస్ట్ చేయడం సరికాదన్నారు.

మానసిక ఒత్తిడికి గురికావొద్దు..

వైరా: విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దని వైరా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయలక్ష్మి , ప్రిన్సిపాల్ నవీనజ్యోతి తెలిపారు. సోమవారం వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యక్తిత్వ వికాసం టెలీ మానస్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. యువత డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిస కాకుండా, చదువకుని భవిష్యత్‌లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ ఈశ్వరరావు, కౌన్సిలర్ ప్రసాదబాబు, లైబ్రేరియన్ స్వప్న పాల్గొన్నారు.

ఎన్‌సీసీ బీ సర్టిఫికెట్ పొందిన న్యూలిటిల్ ఫ్లవర్


కళాశాలకు ఎన్‌సీసీ బీ సర్టిఫికెట్ అందజేస్తున్న ఎన్‌సీసీ అధికారులు

వైరా: ఎన్‌సీసీ బీ సర్టిఫికెట్‌కు వైరా మున్సిపాలిటీ పరిధిలోని న్యూలిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాల అర్హత సాధించింది. ఈ మేరకు ఎన్‌సీసీ హెడ్ క్వార్టర్స్ న్యూఢిల్లీ వారు న్యూలిటిల్ ఫ్లవర్ 11 (టీ) బెటాలియన్ ఖమ్మం వారు ఆధ్వర్యంలో ఎన్‌సీసీ బీ సర్టిఫికెట్ అనుమతి పత్రం అందజేశారు. సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎన్‌సీసీ శిక్షణ తీసుకోవడం మూలంగా విద్యార్థులు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, దేశ భక్తి, దేశ రక్షణ, జాతియతా భావం, సామాజిక సేవ వంటి లక్షణాలు అలవడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధ్యూ, ఏఓ నరసింహారావు సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక


ప్రమాణం చేస్తున్న టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ సభ్యులు

వేంసూరు: టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర చారి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస రెడ్డి, కిషోర్, కార్యదర్శులుగా దీనదయాళ్, భాస్కర్‌రావు, రాఘవులు, హసీనాబేగం, ప్రసన్న కుమార్, సత్యవాణి, ఆడిటర్‌గా రాధకృష్ణ, పలువురి జిల్లా మహాసభ ప్రతినిధులను ఎన్నుకున్నారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమ్మె..

ఎర్రుపాలెం: సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు ఈ నెల 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నారు. ఈ మేరకు సోమవారం ఎంఈఓ మురళీమోహన్‌రావుకు నోటీస్ అందించారు. కార్యక్రమంలో సుభాషిణి, త్రివేణి, లింగయ్య తదితరులున్నారు.

యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయ కన్వీనర్‌గా వినోదరావు


మాట్లాడుతున్న వినోదరావు

మధిర: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్)మధిర ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్‌గా వినోదరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మధిర పట్టణంలోని యూనియన్ ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని వినోదరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి, నాయకులు లక్ష్మణ్ రావు, ఇబ్రహీం, నాగరాజు, వీరయ్య, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, రంగారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం


వైరా: సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్


సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్న దృశ్యం


బోనకల్: ముష్టికుంట్లలో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

వైరా: వైరా మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్లపై నిర్వహిస్తున్న సర్వేను మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన సర్వే ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నోడల్ అధికారి డీఎల్‌పీఓ రాంబాబు, మున్సిపల్ కమిషనర్ వేణు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల: మండలంలోని మల్లుపల్లిలో జరుగుతున్న సర్వేను వైరా నియోజకవర్గ నోడల్ అధికారి, డీఎల్‌పీఓ రాంబాబు సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏ రోజారాణి, ఎంపీఓ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మున్సిపాలిటీలోని 23 వార్డుల్లో 24 మందితో ఇందిరమ్మ ఇళ్ల సర్వే సోమవారం ప్రారంభం కాగా.. కమిషనర్ మందా రావిబాబు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20లోగా సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

కల్లూరురూరల్: మండలంలోని మొత్తం 31 గ్రామ పంచాయతీల పరిధిలో ఇందిరమ్మ గృహాల సర్వే కార్యక్రమాన్ని కల్లూరు మండల స్పెషల్ ఆఫీసర్ సునీత, ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్, తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీఓ సురేష్‌బాబు సమీక్షించారు. రోజుకు కనీసం 30 నుంచి 40 గృహాలు సర్వే చేయాలని అధికారులు నిర్దేశించారు.

బోనకల్: మండలంలోని ముష్టికుంట్లలో ప్రారంభమైన సర్వే తీరును ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ శాస్త్రీ పర్యవేక్షించారు. సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు.

రుణమాఫీ చేయాలి

కొణిజర్ల: రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో పూర్తి చేసే వరకు పోరుబాట కొనసాగుతుందని.. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. సోమవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ తఫ్జల్ హుస్సేన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, కుటుంబరావు, మాధవరెడ్డి, సంక్రాంతి నరసయ్య, నారాయణ, అఫ్జల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

ఎర్రుపాలెం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య, మండల కమిటీ కార్యదర్శి మద్దాల ప్రభాకర్‌లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ ఉషాశారదకు వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించకుంటే.. సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు జోగయ్య, వెంకటరామయ్య, బసవయ్య, అప్పారావు, సుబ్బారెడ్డి, మస్తాన్, తదితరులున్నారు.

వెలవెలబోయిన ప్రజావాణి

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి అధికారులు లేక వెలవెల బోయింది. మధ్యాహ్నం 12గంటలు దాటినప్పటికీ ఆయా శాఖల అధికారులు ప్రజావాణికి రాకపోవడంతో ఈ కార్యక్రమానికి స్పందన కొరవడింది. సమావేశానికి వచ్చిన కొందరు అధికారులు సెల్‌ఫోన్లు చూస్తూ నిట్టూర్పులతో కనిపించారు. మండలకేంద్రంలో ప్రజలకు అందుబాటులో ప్రజావాణి నిర్వహిస్తే బాగుంటుందని, స్థానిక సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని భావించిన జిల్లా యంత్రాంగానికి స్థానిక అధికారులు తూట్లు పొడుస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రైవేట్ పరం చేయొద్దు..

కల్లూరురూరల్: మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయొద్దని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నిమ్మటూరి రామకృష్ణ అన్నారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎంఈఓ పత్తిపాటి నివేదితకు వినపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ఈ నెల 11న జిల్లా కలెక్టర్ ఎదుట ధర్నా చేపడతామని, అదే విధంగా నిరసనలు, ర్యాలీలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, నాయకులు దయాకర్, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

సీపీఎం వైరా డివిజన్..


సింగరాయపాలెంలో సభా వేదిక పనులు పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కొణిజర్ల: ఈ నెల 11న కొణిజర్ల మండలం సింగరాయపాలెంలో జరిగే సీపీఎం వైరా డివిజన్ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం సింగరాయపాలెంలో ఆ పార్టీ మహాసభ వేదిక పనులను నాయకులు పరిశీలించి మాట్లాడారు. సభకు ముఖ్య అతిధులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సుదర్శన్, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, కృష్ణార్జునరావు, మాజీ సర్పంచ్ జ్యోతి, అఫ్జల్, నాగేశ్వరరావు, రోషన్ బేగ్, ఖాసీమ్ బేగ్, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్..

బోనకల్: టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా నాయకుడు సద్దాబాబు కోరారు. సోమవారం మండలకేంద్రంలో మహాసభ పోస్టర్లను ఎంఈఓ దామాల పుల్లయ్య చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సద్దాబాబు మాట్లాడుతూ.. ఈ నెల14, 15వ తేదీల్లో సత్తుపల్లిలో జరుగు జిల్లా 6వ విద్యా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రామకృష్ణ, గోపాల్ రావు, చిన్న రంగారావు, నరసింహారావు, సురేష్, హరికృష్ణ, పద్మావతి తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

సోనియా గాంధీ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రాల్లోని ఆయా పార్టీ కార్యాలయాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలు చోట్ల ఆమె చిత్రపటాలకు పాలాభిషేకం చేసి.. అన్నదానాలు, ఆరోగ్యకేంద్రాలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.
– సాక్షి నెట్‌వర్క్


సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలో కేక్‌కట్ చేస్తున్న డాక్టర్ మట్టా దయానంద్


వైరాలో కేక్ తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఎర్రుపాలెంలో..